‘మహిళాశక్తి’ని పటిష్టంగా అమలు చేయాలి

- మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు
- సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించాలి
- ఈ పథకంలో 14 రకాల జీవనోపాధులకు అవకాశం
- సమీక్షలో కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి

ఖిలా వరంగల్ : కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారదాదేవి

ఖిలావరంగల్, జూన్ 25: జిల్లాలో మహిళాశక్తి పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సెర్ప్, స్త్రీనిధి సిబ్బందికి ఈ పథకంపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సభ్యులకు మరింత చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. ఈ పథకం కింద గ్రామ సమాఖ్యలోని సంఘాలకు కోటి రూపాయల వరకు వడ్డీ లేని రుణాలను అందజేయడంతో పాటు ఎస్‌హెచ్‌జీ మహిళలకు రూ. ఐదు లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తారన్నారు. ఈ పథకాన్ని జిల్లాలో దిగ్విజయంగా అమలు చేయాలని సూచించారు. స్వయం సహాయ సంఘాల ద్వారా సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలు నిర్వహించుకునేలా ప్రోత్సహించి, సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడం మహిళా శక్తి పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. సూక్ష్మ తరహా పరిశ్రమలను గుర్తించి సంఘాలను ప్రోత్సహించడం, ఆయా సంఘాల్లో మహిళలు తమ నైపుణ్యాలకు తగిన ఉత్పత్తులను ఎంచుకొని, ఆయా ఉత్పత్తులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించాలన్నారు.

మార్కెటింగ్‌కు ప్రణాళిక

ఉత్పత్తికి అవసరమైన ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం కల్పించడం, ఉత్పత్తి అయిన సరుకుల మార్కెటింగ్‌కు అవసరమైన ప్రణాళికలు, సహకారం అందించడం మహిళా శక్తి పథకంలో భాగమని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 2024–25 సంవత్సరానికి 9013 మంది మహిళా సంఘాల సభ్యులకు రూ. 93.80 కోట్ల విలువగల కార్యాచరణ ప్రణాళికను చేపట్టనున్నట్లు వివరించారు. మైక్రో ఎంటర్‌ప్రైజెస్, పర్మనెంట్ స్టిచింగ్ సెంటర్లు, పాడి గేదెల పెంపకం, మొబైల్ ఫిష్ అవుట్ లెట్, పాల డెయిరీల ప్రోత్సాహం, మీసేవ కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వ్యవసాయ అనుబంధ పరికరాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్లు తదితర 14 రకాల జీవనోపాధులు ఇందులో భాగమన్నారు. చిరు వ్యాపారులను ప్రోత్సహించాలని, లబ్ధిదారులను నిర్ణీత సమయంలోగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఆర్డీవో కౌసల్యాదేవి, అదనపు డీఆర్డీవో రేణుక, జిల్లా పరిశ్రమల అధికారి నర్సింహమూర్తి, ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ మధుసూదన్‌రావు, ఈడీ ఎం రాజ్‌కుమార్, డెయిరీ, పశుసంవర్ధక, ఎస్‌బీఐ, ఫుడ్ సేఫ్టీ, రెడ్‌కో, కృషి విజ్ఞాన కేంద్రం శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం

రైతులు సందేహాలను నివృత్తి చేసుకోవాలి : కలెక్టర్

వర్ధన్నపేట : వ్యవసాయ రంగానికి సాంకేతికతను అనుసంధానం చేస్తూ రైతు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించిందని కలెక్టర్ సత్య శారదాదేవి అన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా వర్ధన్నపేట రైతు వేదికలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జేడీఏ ఉషాదయాళ్, ఇతర అధికారులతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వర్ధన్నపేట రైతు వేదిక ద్వారా రైతులు కూడా పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతి మంగళ, శుక్రవారం రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు హాజరై వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. రైతులు కేవలం పంటలపైనే ఆధారపడకుండా వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, చేపల పెంపకం చేపట్టాలని కోరారు. అలాగే, పలువురు రైతుల నుంచి రైతు భరోసాకు సంబంధించిన అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ఏడీఏ సురేశ్‌కుమార్, జిల్లా అధికారులు, రైతులు పాల్గొన్నారు.

‘పంట రుణాలు ఇవ్వకపోవడం అన్యాయం’

ఖిలావరంగల్, జూన్ 25: వానకాలం సాగు పనులు ప్రారంభమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాలు, రైతు భరోసా పంపిణీ చేయకపోవడం అన్యాయమని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పంట రుణాలకు రూ. 2 లక్షల రుణమాఫీని ముడిపెట్టి బ్యాంకర్లు రైతులకు కొత్త రుణాలు ఇవ్వడం లేదన్నారు. స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించి, రుణాలు ఇస్తున్నట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రైతులకు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకపోతే అన్నదాతలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, నర్ర ప్రతాప్, మల్లికార్జున్, కేశెట్టి సదానందం, బుడిమే సురేందర్, ఐతం నగేశ్ పాల్గొన్నారు.

చెరువు కుడి కాల్వ కట్ట ఆక్రమణ

నల్లబెల్లి, జూన్ 25 : రంగాయ చెరువు కుడి కాల్వ కట్టను ఓ రైతు ఆక్రమించుకొని సాగు చేస్తున్నాడు. పంతులుపల్లె గ్రామానికి చెందిన రైతు ఎరుకల రాజేశ్వర్‌రావు రంగాయ చెరువు ప్రాజెక్ట్ కుడి కాల్వ నిర్మాణం కోసం 20 గుంటల భూమిని ప్రభుత్వానికి ఇచ్చాడు. నష్టపరిహారంగా ప్రభుత్వం నుంచి రూ. 5 లక్షలకు పైగా పొందాడు. పరిహారం పొందిన సదరు రైతు ఏకంగా కుడి కాల్వ కట్టను ధ్వంసం చేసి పంట భూమిగా మార్చి విత్తనాలు నాటాడు. అలాగే, కాల్వ కట్టపై నుంచి రైతులతో పాటు సంబంధిత అధికారుల వాహనాలు వెళ్లకుండా కంచె ఏర్పాటు చేశాడు. ఈ ఆక్రమణపై ఐబీ ఏఈ రత్నాకర్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించడం నేరమన్నారు. కాల్వ కట్టను ఆక్రమణపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వానకాలం రైతుబంధును విడుదల చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ

బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నామాల సత్యనారాయణ

నర్సంపేట రూరల్, జూన్ 25: వానకాలం రైతుబంధు సాయాన్ని వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ రాష్ట్ర ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానకాలం సాగు ప్రారంభమైనా ఇప్పటి వరకు రైతులకు సాయం అందించకుండా కాంగ్రెస్ ప్రభు త్వం మోసం చేయాలని చూస్తున్నదని విమర్శించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్న మోసాలను రైతులు గమనిస్తున్నారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహారాములు, క్లస్టర్ బాధ్యులు మోతె జయపాల్‌రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, కట్ల సుదర్శన్‌రెడ్డి, కొడారి రవన్న, మోటూరి రవి, తాళ్లపెల్లి రాంప్రసాద్, భూక్యా వీరన్న, కడారి కుమారస్వామి పాల్గొన్నారు.

చెట్టు కాదు.. విద్యుత్ స్తంభమే

ఉర్సు రజకవాడలో విద్యుత్ స్తంభం

కరీమాబాద్, జూన్ 25: తీగలతో అల్లుకుని ఉందని చెట్టు అనుకుంటే పొరపాటే..అది చెట్టు కాదు.. విద్యుత్ స్తంభం. ఉర్సులోని రజకవాడలో కొంతకాలంగా చెట్ల తీగలతో విద్యుత్ స్తంభం నిండిపోయిందని, తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం నేప థ్యంలో ప్రమాదం జరుగకముందే కరెంట్ స్తంభానికి అల్లుకున్న చెట్ల తీగలని తొలగించాలని వారు కోరుతున్నారు.

రైతు భరోసా సమయానికి అందించాలి

వర్ధన్నపేట : రైతునేస్తం సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సత్య శారదాదేవి, అధికారులు

నిబంధనల పేరుతో ఇబ్బందులు

వర్ధన్నపేట/నర్సంపేట, జూన్ 25: ప్రతి రైతుకూ ‘రైతుభరోసా’ అందించాలని అన్నదాతలు కోరారు. వర్ధన్నపేట, నర్సంపేటలో ని రైతు వేదికల్లో మంగళవారం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సం దర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను వర్ధన్నపేట రైతు వేదికలో కలెక్టర్ సత్య శారదాదేవి సమక్షంలో వెల్లడించారు.

షరతులు పెట్టడం సరికాదు

– కడారి అశోక్, లింగగిరి

రైతు భరోసాకు షర తులు పెట్టడం సరికాదు. నియమ నిబంధనలు లేకుండా డబ్బులు ఇవ్వాలి. రైతు భరోసాను పదెకరాల వరకే ఇస్తే మంచిది. పక్కాదారి పట్ట కుండా ఉంటది. పట్టా భూమి ఉన్న ప్రతి రైతుకూ ఇవ్వాలి. కొందరు భూమిలేని కౌలు సేద్యం చేస్తున్నారు. వారికి కూడా రైతు భరోసా సాయాన్ని అకౌంట్లలో వేయాలి. రైతులకు రుణమాఫీని కూడా చేస్తామని హామీ ఇచ్చారు. అది కూడా త్వరితగా అమలు చేయాలి. రైతులు కోరుకున్నట్లు ఈ పథకాన్ని కొనసాగించాలి.

సాగు భూములకు సాయం అందాలె

– అల్లమనేని కమలాకర్‌రావు, వర్ధన్నపేట

సాగులో ఉన్న భూములన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇయ్యాలె. ప్రస్తుత పరిస్థితులల్ల పంటలు సాగు చేయాలంటే పెట్టుబడులు, కూలీల ఖర్చు విపరీతంగా పెరిగింది. ఐదెకరాలకంటే ఎక్కువ భూమి ఉన్న రైతులు పంటలు పండివ్వకున్నా పర్వాలేదా?. రైతు భరోసా ఇవ్వకపోతే ఐదెకరాలకు ఎక్కువ భూమి ఉన్న రైతులు పంటలు సాగు చేయడమే కష్టంగా మారుతది. దీనివల్ల వేల ఎకరాల్లో భూములు బీళ్లుగా ఉండిపోతై. ఈ విషయాన్ని కిందిస్థాయిలో ఉన్న అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలి.

పదెకరాల వరకు రైతు భరోసా ఉండాలి

– షేక్ మజ్దూర్ అహ్మద్, వర్ధన్నపేట

పదెకరాల వరకు రైతు భరోసా వర్తింపజేయాలి. ప్రస్తుత పరిస్థితితుల్లో రైతు భరోసా అందితేనే రైతులు వ్యవసాయం చేసే పరిస్థితి ఉన్నది. కేవలం ఐదెకరాలకు ఇస్తే ఆపై భూమి ఉన్న రైతులు వ్యవసాయం చేయడం ఇబ్బందిగా మారుతుంది. ఐదెకరాల కటాఫ్ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

పెన్షన్ డబ్బుల రికవరీలో నిర్లక్ష్యం

నర్సంపేట, జూన్ 25: పెన్షన్ డబ్బుల రికవరీలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంసీపీఐయూ నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది రాజకీయ నాయకుల అండతో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జన్ను రమేశ్, కలకట్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

సంగెం,జూన్ 25: సీజనల్ వ్యాధుల నివారణకు బుధవారం నుంచి మండలంలో పశువులకు టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి వల్లె రాజు తెలిపారు. నేడు తిమ్మాపురం, 27న కొత్తగూడెం, 28న కుంటపల్లి, 29న సంగెం, జూలై 1న చింతలపల్లి, 2న కృష్ణానగర్, 3న ఎల్గూర్‌రంగంపేట, 4న నర్సానగర్, 5న ఎల్గూర్‌స్టేషన్, బిక్కోజీనాయక్‌తండా, 6న మొండ్రాయి, గొల్లపల్లి, 8న నార్లవాయి, 9న నల్లబెల్లి, బాలునాయక్‌తండా, 10న వీఆర్‌ఎన్‌తండా, పల్లార్‌గూడ, 11న పోచమ్మతండా, 12న గాంధీనగర్, 13న తీగరాజుపల్లి, సోమ్లాతండాలో టీకాలు వేయనున్నట్లు డాక్టర్ రాజు తెలిపారు.

జయప్రదం చేయాలి

నర్సంపేట, జూన్ 25: పీడీఎస్‌యూ రాష్ట్ర సభలను జయప్రదం చేయాలని డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్ కోరారు. నర్సంపేటలోని ప్రభుత్వ కళాశాలలో మంగళవారం ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. సభలను వరంగల్‌లో జూలై 6, 7న నిర్వహించనున్నట్లు తెలిపారు. అజిత్, శ్యామ్, కల్యాణి, శ్రావణ్, రవి, అనూష, రఘు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

ఖిలావరంగల్, జూన్ 25: అంతర్రాష్ట్ర దొంగను మిల్స్‌కాలనీ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మల్లయ్య కథనం ప్రకారం.. శివనగర్ రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. భద్రాచలం కొత్తగూడెం జిల్లాకు చెందిన కనితి వెంకటేశ్వర్లు అనుమానస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. అతడు 18 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు గుర్తించి, అతడి వద్ద ఉన్న రూ. 1.20 లక్షల విలువైన మొబైల్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

వరంగల్ రైల్వేస్టేషన్ సందర్శన

ఖిలావరంగల్, జూన్ 25: వరంగల్ రైల్వేస్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే డీఎం భర్తేశ్‌కుమార్ జైన్ మంగళవారం రాత్రి సందర్శించారు. కాజీపేట, విజయవాడ సెక్షన్‌లోని మూడో లైన్, పలు స్టేషన్లల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అమృత్ పథకంలో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో చేపట్టిన పనులను పరిశీలించారు. ప్లాట్‌ఫాం, రెస్ట్ రూంలు, ఎస్కలేటర్లు, లిఫ్ట్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

ఘనంగా ఏఐఎస్‌బీ ఆవిర్భావ దినోత్సవం

గిర్మాజీపేట, జూన్ 25: అఖిల భారత విద్యార్థి బ్లాక్(ఏఐఎస్‌బీ) 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం 25వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న బీసీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ. 7 వేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రోహిత్, నాయకులు ప్రవీణ్, అఖిల్, ఫుర్ఖాన్, యాకూబ్, రవి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కన్నారావుపేటలో అభివృద్ధి పనులపై సర్వే చేస్తున్న బృందం

పీఎంఏజీవై అభివృద్ధి పనులపై సర్వే

నల్లబెల్లి, జూన్ 25: పీఎం ఆవాస్ యోజన ద్వారా ఎంపికైన ఉత్తమ జీపీలకు మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై ఏటూరునాగారం ఐటీడీఏ నేతృత్వంలో ప్రత్యేక రీసెర్చ్ బృందం మంగళవారం సర్వే చేపట్టింది. కేసీఆర్ ప్రభుత్వం హయాంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన కన్నారావుపేటకు పీఎంఏజీవై నిధులు రూ. 20 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామంలోని సీసీరోడ్లు నిర్మించారు. ఐటీడీఏ డీఈ చందర్‌తో పాటు కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ నూకారపు శ్రీనివాస్‌తో కూడిన విద్యార్థుల బృందం గ్రామంలో సర్వే చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాల పేర్లను మార్చి చేస్తున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తంగెళ్ల నిర్మలా రవీందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, బృందం సభ్యులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పేదలకు అండగా కల్యాణలక్ష్మి : ఎమ్మెల్యే

వర్ధన్నపేట, జూన్ 25: పేద కుటుంబాల్లో యువతుల వివాహాలకు కల్యాణలక్ష్మి పథకం అండగా నిలుస్తున్నదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌సాగర్ అధ్యక్షతన పర్వతగిరి, ఐనవోలు, ఖిలావరంగల్ మండలాల్లోని 63 మంది లబ్ధిదారులకు మంగళవారం ఆయన చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, రైతులతో రైతు భరోసాకు సంబంధించిన పలు విషయాలపై సమగ్రంగా చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ అంగోత్ అరుణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

రాయపర్తి, జూన్ 25: గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. కొత్తూరులో జడ్పీ హెచ్‌ఎస్ ఆవరణలో మంగళవారం హనుమకొండలోని ఏకశిలా హస్పిటల్స్ (మాక్స్‌కేర్) సారథ్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానలు ధనార్జనే లక్ష్యం కాకుండా సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు మాచర్ల ప్రభాకర్, మందాడి సుదర్శన్‌రెడ్డి, ఎంఈవో నోముల రంగయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆడెపు రవీందర్‌ను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

జయంతిని ఘనంగా నిర్వహించాలి

కాశీబుగ్గ, జూన్ 25: సమష్టి కృషితో మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ పిలుపునిచ్చారు. వరంగల్ 19, 20, 26వ డివిజన్ల పద్మశాలీ సంఘం సభ్యుల సమావేశం మంగళవారం వడ్నాల నరేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా పద్మశాలీలు ఏకమై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రవీందర్‌ను సత్కరించారు. సమావేశంలో 19వ డివిజన్ అధ్యక్షుడు క్యాతం రంజిత్, 20వ డివిజన్ అధ్యక్షుడు ములుక సురేశ్, 26వ డివిజన్ అధ్యక్షుడు కూచన రమేశ్, సామల వెంకటస్వామి, బొద్దుల కుమార్, వేముల నాగరాజు, వంగరి రాంప్రసాద్, దుస్సా కృష్ణ, కుందారపు గోపి, గుండు శ్రీనివాస్, బాలమోహన్, చిలగాని రమేశ్, బొప్పరాతి నగేశ్, కూచన శివ, సిరిపురం శశిబాబు, రామ శివ, రంగు శ్రీధర్ పాల్గొన్నారు.

మండల కో ఆప్షన్ మాజీ సభ్యుడి మృతి


యాకూబ్ (ఫైల్)

రాయపర్తి, జూన్ 25: కాట్రపల్లికి చెందిన బీఆర్‌ఎస్ మండల సీనియర్ నాయకుడు మహ్మద్ యాకూబ్ అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. యాకూబ్ 2014–2019 వరకు మండల కో–ఆప్షన్ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

సంగెం, జూన్ 25: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సంగెం రైతు వేదికలో సమావేశం ఉంటుందని, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు. అధికారులు తమ ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

మహాకాళేశ్వరుడిగా అలంకరణ

గిర్మాజీపేట, జూన్ 25: జ్యేష్ఠ బహుళ తదియ సందర్భంగా సోమవారం సాయంత్రం ప్రదోష కాలంలో స్టేషన్‌రోడ్‌లోని ఆకారపు వారి గుడిలో ప్రధానార్చకుడు లంకా శివకుమార్‌శర్మ కాశీవిశ్వనాథుడిని మహాకాళేశ్వరుడిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ట్రస్టీ ఆకారపు హరీశ్–స్వాతి దంపతులు, ఈవో ఎన్ వెంకట్రావు, సిబ్బంది వీరన్న, లక్ష్మి, సాగర్ పాల్గొన్నారు.

శివలింగాన్ని అలంకరిస్తున్న అర్చకుడు శివకుమార్‌శర్మ

అవయవ దానం మరొకరికి ప్రాణదానం

భారతి చారిటబుల్ మేనేజింగ్ ట్రస్టీ రాజేంద్రప్రసాద్

విజయను సన్మానిస్తున్న ఆడెపు రాజేంద్రప్రసాద్

గిర్మాజీపేట, జూన్ 25: అవయవదానం మరొకరికి ప్రాణదానమని భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రపంచ అవయవదానం, మార్పిడి దినోత్సవం సందర్భంగా మంగళవారం మట్టెవాడ బొమ్మలగుడి ప్రాంతంలో నివాసముంటున్న శామంతుల విజయను శాలువాతో సత్కరించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ తన కుమారుడికి కిడ్నీ దానం చేసి పునర్జన్మనిచ్చిందని కొనియాడారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని అవయవదానంపై యువత తమకు ఉన్న అపోహలను తొలగించుకొని ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఆర్గనైజర్ శ్రవణ్, కో ఆర్డినేటర్ వారణాసి మోహన్, మిట్టపల్లి సమ్మయ్య, నరేంద్రచారి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 25 దేశ చరిత్రలో చీకటి రోజు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

కాశీబుగ్గ, జూన్ 25: జూన్ 25వ తేదీ దేశ చరిత్రలోనే చీకటి రోజు ఎమర్జెన్సీ అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. దేశాయిపేటరోడ్డులోని బీజేపీ కార్యాలయంలో ఎమర్జెన్సీ చీకటి రోజులో భాగంగా మంగళవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వీరులు, ఉద్యమకారులను సన్మానించారు. అనంతరం ప్రేమేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి చీకటి రోజును ఎప్పటికీ మర్చిపోలేమని, క్షమించమన్నారు. 1977 మార్చి 21వ తేదీ వరకు ఇందిరాగాంధీ రాజకీయ ప్రత్యర్థులను జైలుపాలు చేసి పత్రికలను సెన్సార్ చేశారన్నారు. వాస్తవాలను చెప్పేందుకు ప్రయత్నించిన పత్రికలపై నిర్బంధం విధించారని, ప్రశ్నించే వారి గొంతు నొక్కారని గుర్తు చేశారు. దేశ ప్రజాస్వామ్య చరిత్రలోనే 1975 జూన్ 25 చీకటి రోజుగా నిలిచిపోయిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, అరూరి రమేశ్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, విజయ్‌చందర్‌రెడ్డి, గజ్జెల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

లింగ నిర్ధారణ ముఠా అరెస్ట్

స్కానింగ్ మిషన్, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

నిందితుల అరెస్ట్ చూపిస్తున్న హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి

సుబేదారి, జూన్ 25 : చట్ట వ్యతిరేకంగా లింగ నిర్ధారణకు పాల్పడుతున్న నలుగురి ముఠాను హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం హనుమకొండ పోలీసు స్టేషన్‌లో ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కాజీపేట కడిపికొండకు చెందిన ప్రధాన నిందితురాలు నర్సు బస్కె స్రవంతి, ములుగు జిల్లా పత్తిపల్లికి చెందిన కాసిరాజు దిలీప్, హనుమకొండ కుమార్‌పల్లికి చెందిన జంగా రాజమణి, వరంగల్ కాశీబుగ్గకు చెందిన ల్యాబ్ టెక్నిషియన్ ఏకుల నరేశ్ ముఠాగా ఏర్పడ్డారు. హనుమకొండలో రాహస్యంగా లింగనిర్ధారణ స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ ముఠా హనుమకొండ వేయిస్తంభాల గుడి సమీపంలోని ఓ బాధితురాలికి లింగ నిర్ధారణ పరీక్షలు చేసి, అమ్మాయిగా గుర్తించారు. గర్భస్రావం కోసం టాబ్లెట్ ఇచ్చారు. బాధితురాలు వారిచ్చిన టాబ్లెట్ వేసుకోవడంతో అనారోగ్యానికి గురైంది. స్థానిక దవాఖానలో చికిత్స చేసుకొని విషయాన్ని డాక్టర్‌కు చెప్పింది. సదరు డాక్టర్ డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. జిల్లా వైద్య అధికారుల ఫిర్యాదు మేరకు నలుగురు నిందితులను హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ముఠాలో ప్రధాన నిందితురాలిగా ఉన్న స్రవంతి గతంలో ఇలాగే గర్భస్రావానికి పాల్పడడంతో ఆమెపై ఐదు కేసులు నమోదయ్యాయి. ఒక కేసులో జైలుకు కూడా వెళ్లి, వచ్చింది. అయినా పద్ధతి మార్చుకోకుండా మరోసారి పోలీసులకు చిక్కింది. కార్యక్రమంలో హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, YARA LINGA MURTHY, S/o. Y.SAMBAIAH (Old Name), R/o. H.No. 5-12, Ramakrishnapur Village, Nadikuda Mandal, Hanumakonda Dist. T.G., 506391, That have changed my name to YARA LINGA REDDY, S/o. YARA SAMMI REDDY (New Name). NTW-403

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557